సాయుధ ఘర్షణలే తక్షణ ముప్పు

- వచ్చే పదేండ్లలో తగ్గనున్న పశ్చిమ దేశాల ప్రాబల్యం
- ప్రత్యామ్నాయ పవర్ సెంటర్లుగా చైనా, భారత్, గల్ఫ్ దేశాలు
- ప్రపంచ ఆర్థిక వేదిక తాజా నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 15: దేశాల మధ్య సాయుధ ఘర్షణలే ప్రపంచానికి తక్షణ ముప్పుగా పరిణమించినట్టు ప్రపంచ ఆర్థిక వేదిక(డబ్ల్యూఈఎఫ్) పేర్కొంది. 2025 ఏడాదికి సంబంధించి ప్రపంచం ఎదుర్కోనున్న ముప్పులపై బుధవారం ఓ నివేదికను విడుదల చేసింది. ఈ ఏడాదిలో భూగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా చీలికలు పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. తప్పుడు సమాచారం వల్ల స్వల్పకాలిక ముప్పులు ఏర్పడుతాయని, రానున్న 10 సంవత్సరాల కాలంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు, జీవవైవిధ్య నష్టం, పర్యావరణ వ్యవస్థ పతనం వంటి పర్యావరణ ముప్పులు అధిక ప్రభావం చూపుతాయని నివేదిక పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార, ప్రభుత్వ, మేధావి, పౌర సమాజానికి చెందిన 800 మందికిపైగా ప్రపంచ నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించి ఈ నివేదికను డబ్ల్యూఈఎఫ్ రూపొందించింది.

ప్రత్యామ్నాయ అధికార కేంద్రాలు..

రానున్న పదేళ్ల కాలంలో ప్రపంచ రాజకీయ పరిస్థితిని అంచనా వేస్తూ బహుళ ధ్రువ లేదా చీలికలతో కూడిన ప్రపంచం ఏర్పడవచ్చని ప్రపంచ నాయకులు అంచనా వేస్తున్నారని నివేదిక వెల్లడించింది. పశ్చిమ దేశాల నాయకత్వం బలహీన పడడం కొనసాగి చైనా, భారత్, గల్ఫ్ దేశాల రూపంలో ప్రత్యామ్నాయ అధికార కేంద్రాలు బలోపేతం అయ్యే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారని తెలిపింది. అయితే ప్రపంచంపై పశ్చిమ దేశాల ప్రాబల్యం తగ్గుతుండడం కొనసాగినప్పటికీ అవి అధికార కేంద్రంలో ముఖ్యమైన పాత్రను పూర్తిగా కోల్పోబోవని నివేదిక పేర్కొంది.

దూరదృష్టితో ఎదుర్కోవాలి..

ప్రపంచం ఎదుర్కోనున్న తక్షణ, స్వల్పకాలిక, దీర్ఘకాలిక ముప్పులను వెల్లడించిన ఈడబ్ల్యూఎఫ్.. రానున్న సవాళ్లను దూరదృష్టితో ప్రపంచ నాయకులు ఎదుర్కోవాలని సూచించింది. భౌగోళిక రాజకీయ, పర్యావరణ, సామాజిక, సాంకేతిక సవాళ్ల కారణంగా ప్రపంచంలో చీలికలు పెరిగిపోతాయని నివేదిక పేర్కొంది. ఇవి సుస్థిరతకు, అభివృద్ధికి అవరోధంగా మారతాయని ఈడబ్ల్యూఎఫ్ హెచ్చరించింది. ఆర్థికపరమైన ముప్పులు ఈ ఏడాది తక్షణం ప్రభావం చూపనప్పటికీ సామాజిక పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్త పరిస్థితులు పరస్పరం ఒకదానికొకటి సంబంధించినవి కాబట్టి అవి ఆందోళన కలిగించే అంశాలేనని నివేదిక పేర్కొంది. 2025లో ప్రభుత్వ ఆధారిత సాయుధ ఘర్షణలు అత్యంత ముఖ్యమైన ప్రపంచ ముప్పుగా పలువురు ఆందోళన వ్యక్తం చేసినట్టు నివేదిక తెలిపింది.

భారత రాజ్యంతో పోరాడుతున్నాం

- రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలు
- కాంగ్రెస్ వికృత రూపం ఇదే: బీజేపీ

న్యూఢిల్లీ, జనవరి 15: బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు భారత రాజ్యంతోనూ తమ పార్టీ పోరాడుతున్నదని కాంగ్రెస్ నాయకుడు రాహుఎల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. రాహుల్ గాంధీ చెప్పే మాటలు, చేసే చేష్టలన్నీ భారతదేశాన్ని ముక్కలు చేసి, సమాజాన్ని చీల్చే దిశలోనే ఉంటాయని బీజేపీ మండిపడింది. బుధవారం నాడిక్కడ కాంగ్రెస్ పార్టీ నూతన ప్రధాన కార్యాలయ భవనం ప్రారంభోత్సవంలో రాహుల్ ప్రసంగిస్తూ అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రాణపత్రిష్ఠ తర్వాతే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందంటూ ఆర్ఎస్ఎస్ అగ్రనేత మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు దేశద్రోహం కిందకు వస్తాయని, ఇది భారతీయులని అవమానించడమేనని అన్నారు. తాము నిజాయితీగా పోరాడుతున్నామని భావించవద్దని, ఇందులో నిజాయితీ లేనేలేదని రాహుల్ అన్నారు. తామంతా రాజకీయ సంస్థలైన బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పోరాడుతున్నామని, మన దేశంలోని ప్రతి వ్యవస్థను ఆ రెండూ కబ్జా చేశాయని ఆయన ఆరోపించారు. తామంతా ఇప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తోపాటు భారత రాజ్యంతోనూ పోరాడుతున్నామని ఆయన పేర్కొన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ వికృత రూపాన్ని ఆ పార్టీ నాయకుడే బయటపెట్టారన్నారు. రాహుల్ గాంధీకి ఆయన సన్నిహితులకూ అర్బన్ నక్సల్స్‌తో, దేశాన్ని అవమానించి, కించపరిచి, అప్రతిష్ట పాల్జేయాలని భావించే వ్యక్తులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న విషయం రహస్యమేమీ కాదని నడ్డా ఆరోపించారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ భారత రాజ్యంతోనూ పోరాడుతున్నామని చెబుతున్న రాహుల్.. చేతిలో రాజ్యాంగం ప్రతిని ఎందుకు ఉంచుకుంటున్నారని ప్రశ్నించారు.

ఇజ్రాయెల్ -హమాస్ యుద్ధానికి తెర

కాల్పుల విరమణకు ఇరు వర్గాలు ఓకే

దోహా, జనవరి 15: గత 15 నెలలుగా ఇజ్రాయెల్-హమాస్ ఉగ్రవాదుల మధ్య జరుగుతున్న యుద్ధానికి తెరపడింది. ఇరు వర్గాలు కాల్పుల విరమణకు అంగీకరించినట్టు బుధవారం మధ్యవర్తులు ప్రకటించారు. కొన్ని వారాల క్రితం నుంచి ఖతార్ రాజధానిలో ఎడతెరపి లేకుండా జరిగిన చర్చల అనంతరం ఈ కాల్పుల విరమణ ఒప్పందం జరిగిందని తెలిపారు. దీనిలో భాగంగా హమాస్ చేతిలో ఉన్న డజన్ల కొద్దీ బందీలను విడతల వారీగా విడుదల చేస్తారు. అలాగే ఇజ్రాయెల్ జైళ్లలో ఉన్న వందలాది పాలస్తీనా ఖైదీలను ఆ దేశం విడుదల చేస్తుంది. అలాగే గాజా యుద్ధం కారణంగా దేశం విడిచిపోయిన వేలాది మంది తమ ఇళ్లకు తిరిగి రావడానికి ఇజ్రాయెల్ అంగీకరించింది. అలాగే యుద్ధం కారణంగా ధ్వంసమైన ప్రాంతాలకు మానవతా దృష్టితో సాయం అందజేస్తుంది. ఒప్పందం జరిగిన విషయాన్ని ముగ్గురు అమెరికా అధికారులు, ఒక హమాస్ ప్రతినిధి నిర్ధారించగా, పూర్తి వివరాలు రావాల్సి ఉందని ఇజ్రాయెల్ సీనియర్ అధికారి తెలిపారు.

పోలాండ్ సరిహద్దుల్లో రష్యా దాడులు

మాస్కో, జనవరి 15: ఇంధన రంగ సంస్థలే లక్ష్యంగా పోలాండ్ సరిహద్దు సమీపంలో ఉక్రెయిన్‌పై రష్యా వాయుసేన భీకర దాడులు చేసింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశాల మేరకు టీయూ-22, టీయూ-95 బాంబర్లు గత 24 గంటల్లో పోలాండ్ సరిహద్దు ప్రాంతంపై బాంబుల వర్షం కురిపించాయి. పలు క్షిపణులు పోలాండ్ సరిహద్దు ప్రాంతాల్లో పడటంతో అప్రమత్తమైన పోలాండ్‌లోని నాటో దళాలు బుధవారం ఎదురు దాడికి దిగాయి. భూతల ఆధారిత వాయుసేన, రాడార్ వ్యవస్థలను పూర్తిగా అప్రమత్తం చేసినట్టు పోలాండ్ తెలిపింది. ఇంధన మౌలిక రంగాలు లక్ష్యంగా మరోసారి ఉక్రెయిన్‌పై రష్యా వాయుసేన భారీ దాడులకు దిగినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్‌లో తెలిపారు. ఇంధన, గ్యాస్ సంస్థలు లక్ష్యంగా బాలిస్టిక్ క్షిపణులు సహా మొత్తం 40 మిస్సైల్స్‌ను తమపై రష్యా ప్రయోగించిందని, అందులో 30కు పైగా కూల్చివేసినట్టు తెలిపారు. రాత్రి పూట అదనంగా 70 రష్యా డ్రోన్లతో దాడి జరిగిందని చెప్పారు.

నవంబర్‌లో కర్ణాటక సీఎం మార్పు?

- సిద్ధరామయ్య స్థానంలో డీకే!
- కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం
- నాయకత్వ మార్పుపై ప్రకటనలు చేయరాదని హైకమాండ్ ఆదేశాలు

బెంగళూరు, జనవరి 15: కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో మరోసారి కుర్చీలాటకు తెరలేచింది. అక్కడ నాయకత్వ మార్పు చోటుచేసుకునే అవకాశం ఉందని, అయితే ఇది వెంటనే కాకుండా కొద్ది నెలల సమయం తీసుకుంటుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను తప్పించి, ఆ స్థానంలో ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ని నియమిస్తారని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు అధిష్ఠానం ప్రతిపాదించిన ఫార్ములాయే ఇదని, దాని ప్రకారమే అధికార మార్పిడి చోటుచేసుకుంటుందని పార్టీలోని ఒక సీనియర్ నేత తెలిపారు. అక్టోబర్-నవంబర్ నాటికి సిద్ధరామయ్య స్థానంలో డీకే అధికారం చేపట్టడం ఖాయమని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై ఎలాంటి బహిరంగ ప్రకటనలు చేయవద్దని పార్టీ అధిష్ఠానం ఆదేశించినట్టు కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. ఈ నెల 13న బెంగళూరులో జరిగిన కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) సమావేశంలోనే ఈ విషయాన్ని పార్టీ నేతలకు వెల్లడించినట్టు తెలిసింది. ఈ సమావేశానికి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు రణదీప్ సూర్జేవాల, జైరాం రమేశ్ తదితరులు హాజరయ్యారు.

నా కుర్చీ ఖాళీ లేదు

తనను ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పిస్తారని జరుగుతున్న ప్రచారాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఖండించారు. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. 'నా కుర్చీ ఖాళీ లేదు. నా పదవి భద్రంగా ఉంది' అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంలో తమ మధ్య ఎలాంటి గందరగోళం లేదని, కానీ కొందరు పాత్రికేయులు పనిగట్టుకుని తనను తప్పిస్తారని ప్రచారం చేస్తున్నారని, అలాంటి దేమీ జరగదని ఆయన స్పష్టం చేశారు. ఏదైనా విందుకు మంత్రులు హాజరైతే చాలు మీడియా ఊహాగానాలు చేస్తుందనిఅన్నారు.

నేనెందుకు ముఖ్యమంత్రి కాకూడదు?

ఒక పక్క కర్ణాటకలో సీఎంను మారుస్తారని ప్రచారం జరుగుతున్న వేళ దళితుడినైన తాను ముఖ్యమంత్రిని ఎందుకు కాకూడదని ఎక్సైజ్ శాఖ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్ ప్రశ్నించారు. 'నేను దళితుడిని, దళితులు ఎందుకు ముఖ్యమంత్రి అవ్వకూడదు? నేనెందుకు ఆ పదవిని చేపట్టకూడదు. నేను ముఖ్యమంత్రిని అయితే ఎవరు అభ్యంతరం చెబుతారు?' అని ఆయన మీడియాతో పేర్కొన్నారు. సీఎల్పీ సమావేశం తన పేరును ఆమోదిస్తుందో లేదో తెలియదు కానీ, ఈ అంశాలన్నీ కీలక పాత్ర పోషిస్తాయని, అధిష్ఠానం నిర్ణయిస్తే తానే ముఖ్యమంత్రిని అవుతానని ఆయన అన్నారు. ముఖ్యమంత్రిని మార్చే నిర్ణయం అధిష్ఠానిదేనని ఆయన స్పష్టం చేశారు. మూడు ఆవుల పొదుగులను నరికివేసిన ఘటనపై బీజేపీ నిరసన తెలపడాన్ని ఆయన ప్రస్తావిస్తూ దళితులను హత్య చేసినప్పుడు బీజేపీ ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు.

సౌదీ వర్క్ వీసా రూల్స్ కఠినతరం

న్యూఢిల్లీ, జనవరి 15: సౌదీ అరేబియాలో పనిచేస్తున్న లేదా ఉపాధి కోసం కొత్తగా అక్కడికి వెళ్లాలనుకునే వాళ్లకు ఆ దేశం షాక్ ఇచ్చింది. వర్క్ వీసా జారీకి సంబంధించి నిబంధనల్ని మరింత కఠినతరం చేస్తూ, కొత్త నిబంధనల్ని అమల్లోకి తీసుకొచ్చింది. అలాగే విదేశీ కార్మికుల రెసిడెన్సీ పర్మిట్ (ఇకామా) నిబంధనల్ని కూడా సవరించింది. వర్క్ వీసా జారీకి ఇకపై 'జాబ్ లెటర్' తప్పనిసరి కానున్నది. మార్పులు జనవరి 14 నుంచి అమల్లోకి వస్తున్నాయని భారత విదేశాంగ శాఖ, ఆ దేశంలోని భారతీయ సంఘాలు వెల్లడించాయి. వర్క్ వీసాపై సౌదీ వెళ్లాలనుకునే భారతీయులు ఇకపై తమ విద్య, వృత్తికి సంబంధించి అర్హతలపై ముందస్తు వెరిఫికేషన్ పూర్తిచేయాల్సి ఉంటుంది. వీసా నిబంధనల్లో చేసిన మార్పుల వల్ల సౌదీ అరేబియాలో ఉన్న సుమారు 24 లక్షల మంది ప్రవాస భారతీయులపై ప్రభావం పడుతుందని భావిస్తున్నారు.

పంజాబ్‌లోని ఖనౌరి సరిహద్దు వద్ద దీక్షకు దిగిన రైతులు

111 మంది రైతుల ఆమరణ దీక్ష

డల్లేవాల్‌కు సంఘీభావం

చండీగఢ్, జనవరి 15: గత 51 రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలో ఉన్న రైతు నేత జగ్జీత్ సింగ్ డల్లేవాల్‌కు సంఘీభావంగా, తమ డిమాండ్లను నెరవేర్చడంలో కేంద్రం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా 111 మంది రైతులు బుధవారం ఆమరణ నిరాహార దీక్షను ప్రారంభించారు. పంజాబ్-హర్యానా సరిహద్దు ఖనౌరి వద్ద 70 ఏండ్ల డల్లేవాల్ చేస్తున్న దీక్షతో ఆయన ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని, ఆయన ఆరోగ్యం రోజురోజుకు దిగజారుతున్నదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేతలు ఆరోపించారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధతతో పాటు పలు అంశాలపై తాము చేస్తున్న డిమాండ్లను ఆలకించడానికి కానీ, తమతో చర్చలు జరపడానికి కానీ కేంద్రం ఏమాత్రం ఆసక్తి చూపడం లేదని రైతు నేత అభిమన్యు కోహర్ విమర్శించారు.

వీసా నిబంధనల్ని సడలించిన కెనడా

న్యూఢిల్లీ, జనవరి 15: హయ్యర్ స్టడీస్ చదువుతున్న విద్యార్థులు, కార్మికులకు కెనడా శుభవార్త చెప్పింది. తమ జీవిత భాగస్వామిని కెనడాకు రప్పించేందుకు అవసరమయ్యే 'ఓపెన్ వర్క్ పర్మిట్స్' (ఓడబ్ల్యూపీ) నిబంధనల్ని కెనడా సడలించింది. నూతన 'ఓడబ్ల్యూపీ' విధానాన్ని 2025 జనవరి 21 నుంచి ఇది అమల్లోకి వస్తున్నట్టు తెలిపింది. ఇప్పటికే ఆ దేశంలో పనిచేస్తున్న విద్యార్థుల, కార్మికుల భాగస్వాములు కూడా కొత్త ఓపెన్ వర్క్ పర్మిట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. కెనడా లేబర్ మార్కెట్‌కు, భారతీయ విద్యార్థులకు లబ్ధి చేకూర్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించింది. ప్రొఫెషనల్ కోర్సులు, డాక్టోరల్, మాస్టర్స్ ప్రోగామ్స్, 16 నెలలు లేదా అంతకన్నా ఎక్కువ గడువు కలిగిన కోర్సులు చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల భాగస్వాములు అర్హులుగా పేర్కొన్నది.

తేజస్, వందేభారత్ రైళ్లకు ఎల్‌టీసీ వర్తింపు

కేంద్ర ఉద్యోగులకు శుభవార్త

న్యూఢిల్లీ: లీవ్ ట్రావెల్ కన్సెషన్(ఎల్‌టీసీ) కింద తేజస్, వందేభారత్, హమ్‌సఫర్ రైళ్లలో కేంద్ర ఉద్యోగులు ప్రయాణించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఎల్‌టీసీ కింద వివిధ ప్రీమియం రైళ్లలో ప్రయాణించడానికి అనుమతించాలని కోరుతూ వివిధ కార్యాలయాలు, వ్యక్తుల నుంచి సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ)కి వచ్చిన విజ్ఞప్తుల నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. వ్యయ శాఖతో సంప్రదింపుల ద్వారా ఈ అంశాన్ని అధ్యయనం చేసిన డీఓపీటీ.. ప్రస్తుతం రాజధాని, శతాబ్ది, దురంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు తేజస్, వందేభారత్, హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా ఎల్‌టీసీని విస్తరించాలని నిర్ణయించింది.

యజమాని కోరితే ఖాళీ చేయాల్సిందే

అలహాబాద్ హైకోర్టు తీర్పు

అలహాబాద్: భవనంలో కిరాయికి తీసుకున్న గదులను ఆ భవన యజమాని తన వ్యక్తిగత అవసరం కోసం కోరితే ఖాళీ చేయాల్సిందేనని అలహాబాద్ హైకోర్టు తీర్పు చెప్పింది. అద్దెకు ఉన్నవారికి వ్యతిరేకంగా రూలింగ్ ఇవ్వడానికి ముందు, ఆ యజమాని అవసరం సరైనదేనా? అనే అంశాన్ని కోర్టులు పరిశీలించాలని తెలిపింది. యజమాని ఇష్టం మేరకు మాత్రమే అద్దెకున్నవారు ఉండాలని చెప్పింది. అద్దెకున్నవారు దాఖలుచేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఈ కేసులో భవన యజమానికి వేరొక చోట బైక్ మరమ్మతు చేసే దుకాణం ఉంది. దానిని ఖాళీ చేయాలని ఆ భవన యజమాని కోరడంతో, తన సొంత భవనంలోని రెండు దుకాణాలను ఖాళీ చేయాలని కోరారు. అందుకు కిరాయికి ఉన్నవారు తిరస్కరించారు. దీంతో ఆయన అధికారులను ఆశ్రయించగా ఆ దుకాణాలను ఖాళీ చేయాలని ఆదేశించారు. దీనిపై అద్దెకున్నవారి అప్పీలు తిరస్కరణకు గురైంది. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు.

కేజ్రీవాల్ విచారణకు ఈడీకి అనుమతి

న్యూఢిల్లీ, జనవరి 15: కొద్ది రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో మాజీ ముఖ్యమంత్రి, ఆప్ చీఫ్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ తగిలింది. మద్యం పాలసీ కేసులో ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు అనుమతి ఇస్తూ కేంద్ర హోం శాఖ బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి గత ఏడాది మార్చిలో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన ఈడీ ఆయనపై చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న కేజ్రీవాల్ ఫిబ్రవరి 5న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఢిల్లీ నుంచి పోటీ చేస్తున్నారు.

ఎన్‌హెచ్‌లపై మంత్లీ టోల్ పాసులు!

ప్రైవేట్ వాహనాలకు అమలు యోచన: గడ్కరీ

న్యూఢిల్లీ, జనవరి 15: జాతీయ రహదారులపై ప్రైవేట్ వాహనాలు టోల్ చార్జీలు చెల్లించడానికి బదులుగా వాటి కోసం నెల, వార్షిక పాసులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ బుధవారం వెల్లడించారు. జాతీయ రహదారులపై వచ్చే మొత్తం టోల్ వసూళ్లలో 26 శాతం మాత్రమే ప్రైవేట్ వాహనాల నుంచి వస్తోందని ఆయన తెలిపారు. మిగిలిన 74 శాతం రెవెన్యూ వాణిజ్య వాహనాల నుంచి వస్తుందని ఆయన చెప్పారు. ప్రైవేట్ వాహనాలకు నెల, వార్షిక పాసులను ప్రవేశపెట్టే విషయాన్ని పరిశీలిస్తున్నామని గడ్కరీ చెప్పారు.

అనుకోకుండా జరిగిన పొరపాటు.. క్షమించండి

జుకర్‌బర్గ్ వ్యాఖ్యలపై మెటా క్షమాపణ

న్యూఢిల్లీ :భారత ఎన్నికలపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలకు మెటా ఇండియా బుధవారం భారత్‌కు క్షమాపణ చెప్పింది. 2024లో జరిగిన ఎన్నికలలో భారత్‌లోని అధికారంలో ఉన్న పార్టీ ఓడిపోయిందంటూ ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో జుకర్‌బర్గ్ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతున్నట్టు మెటా ఇండియా వైస్ ప్రెసిడెంట్ శివ్‌నాథ్ తుక్రల్ తెలిపారు. ఇది అనుకోకుండా జరిగిన పొరపాటని ఆయన సంజాయిషీ ఇచ్చారు. 2024 ఎన్నికలలో అధికారంలో ఉన్న పార్టీలు తిరిగి గెలవలేదంటూ మార్క్ చేసిన వ్యాఖ్యలు అనేక దేశాలకు సంబంధించి వాస్తవమేనని తెలిపారు. అయితే భారత్‌కు మాత్రం ఇది వర్తించదని ఆయన తెలిపారు.

పార్కింగ్ స్థలముంటేనే కారు అమ్మకం

కొత్త నిబంధనను తేనున్న మహారాష్ట్ర ప్రభుత్వం

ముంబై, జనవరి 15: కారు కొనాలనుకుంటున్నారా? అయితే దానిని పార్కింగ్ చేయడానికి మీకు తప్పని సరిగా స్థలం ఉండాల్సిందే. లేకపోతే మీకు ఎట్టి పరిస్థితుల్లో కార్లను అమ్మరు. ఈ కొత్త పాలసీని మహారాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేయనుంది. పట్టణ ప్రాంతాల్లో వాహనాల రద్దీని నివారించడానికే ఈ నిబంధనను తేవాలని యోచిస్తున్నట్టు మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్నాయక్ వెల్లడించారు. ట్రాఫిక్ రద్దీ సమస్య విపరీతంగా పెరిగిపోయిందని, చాలామంది పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారని, దీని కారణంగా అంబులెన్స్‌లు, ఫైర్ లాంటి సర్వీసులకు ఆటంకం ఏర్పడుతున్నదని ఆయన చెప్పారు. అయితే బీదవారు, మధ్య తరగతి వారు కార్లను కొనుగోలు చేయకుండా నిరోధించడానికి, వారిపై వివక్షను చూపడానికి ఈ నిబంధన తేవడం లేదని స్పష్టం చేశారు.

నౌకాదళంలోకి ఐఎన్ఎస్ సూరత్, నీలగిరి, వాఘ్‌షీర్

ముంబై, జనవరి 15: భారత నౌకాదళంలోకి సరికొత్త అస్త్రాలు చేరాయి. అధునాతన యుద్ధనౌకలు ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ నీలగిరితో పాటు ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామిని బుధవారం జలప్రవేశం చేశారు. ముంబైలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ వీటిని జాతికి అంకితం చేశారు. ఐఎన్ఎస్ సూరత్.. శత్రు నౌకలను ధ్వంసం చేసేందుకు ఉద్దేశించిన పీ15బీ ప్రాజెక్టులో నాలుగవది. ఇందులో అధునాతన ఆయుధ, రాడార్ వ్యవస్థలు ఉన్నాయి. ఐఎన్ఎస్ నీలగిరి.. పీ17ఏ స్టెల్త్ ఫ్రిగేట్ ప్రాజెక్టులో తొలి యుద్ధనౌక. ఇందులో శత్రువుల కళ్లుగప్పే స్టెల్త్ పరిజ్ఞానం ఉన్నది. ఇక ఐఎన్ఎస్ వాఘ్‌షీర్.. పీ 75 ప్రాజెక్టులో ఆరో, చివరి జలాంతర్గామి. డీజిల్-విద్యుత్తుతో నడిచే ఈ జలాంతర్గామి సముద్రంలోపల నుంచే కాక పైనుంచి కూడా ప్రత్యర్థులతో యుద్ధం చేయగలదు. నిఘా సమాచారాన్ని బహుళార్థకంగా సేకరించగలదు.

బుధవారం పుణెలోని ఖాడ్కీ వద్ద నిర్వహించిన 77వ సైనిక దినోత్సవ పరేడ్‌లో 'రోబో డాగ్స్' ప్రదర్శన

గుజరాత్‌లో ఓ ప్రభుత్వాధికారిపై కరెన్సీ నోట్లు విసిరి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ''తాగునీరు, పారిశుద్ధ్యం సక్రమంగా లేవు. ఎంత అవినీతి చేస్తావు? ఎంత తింటావు?'' అంటూ నిరసనకారులు ఆ ప్రభుత్వాధికారిపై కరెన్సీ నోట్ల కట్టలను విసిరారు. ఈ వీడియో వైరల్ అవుతున్నది.

మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యాస్నానాలు చేస్తున్న 'జుంకా అఖాడా'కు చెందిన నాగ సాధువులు. మకర సంక్రాతి సందర్భంగా వేలాదిమంది సాధువులు, భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యాస్నానాలు ఆచరించారు.

తమిళనాడులోని మదురై జిల్లా అవనియపురంలో నిర్వహించిన జల్లికట్టు పోటీల్లో ఎద్దును లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్న యువకులు. సంక్రాంతి పండుగవేళ తమిళనాడులో జల్లికట్టు పోటీలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

ఇదేదో కళాఖండమనుకుంటే పొరపాటే. జమ్ముకశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో వాటర్ పైప్ నుంచి లీకైన నీరు గడ్డకట్టడంతో ఈ మంచు ఖండం రూపుదిద్దుకుంది. దీని ముందు సెల్ఫీలు దిగేందుకు పర్యాటకులు క్యూకడుతున్నారు.